4 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

జైపూర్, ఫిబ్రవరి 19: మండలంలోని వేలాల, కిష్టాపూర్ శివారు గోదావరి నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి వేలాల, కిష్టాపూర్ గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం అక్కడికి వెళ్లి 4 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. యజమానులైన కిష్టాపూర్‌కు చెందిన ఏగోలపు దుర్గాగౌడ్, తడ్వాయి మునిందర్‌రెడ్డి, వేలాల గ్రామానికి చెందిన సిరిశెట్టి సంతోష్, నక్క మల్లేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో రెండు ట్రాక్టర్లకు నంబర్లు లేకపోగా ప్రముఖ కాంగ్రెస్ నాయకుడికి చెందిన ట్రాక్టర్లుగా స్థానికులు చెబుతున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

లక్షెట్టిపేటలో 2 ట్రాక్టర్లు..

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 19: లక్షెట్టిపేట పట్టణంలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సతీశ్ బుధవారం తెలిపారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గొర్రెల దొంగల అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ గంగారాం

కన్నెపల్లి, ఫిబ్రవరి 19 : గొర్రెలు దొంగతనం చేసిన నలుగురు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం, గోటూరు గ్రామానికి చెందిన పార్ల నరేశ్ గత నెల జనవరిలో తన వృత్తిలో భాగంగా గొర్లను మేపేందుకు కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్‌కు గ్రామానికి వచ్చి చుట్టు పక్కల గల పత్తి చేన్లలో తన గొర్రెలను మేపుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 17న తన దగ్గర ఉన్న 160 గొర్రెల్లో నుంచి 33 గొర్రెలను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా జన్కాపూర్ గ్రామానికి చెందిన అల్లి ప్రశాంత్, ముసుకుల సంతోష్, అనంతుల అభిలాష్, వనపర్తి సత్తన్న బొలెరో వాహనంలో గొర్రెలను అనుమానాస్పదంగా తరలిస్తుండగా కన్నెపల్లి సబ్‌స్టేషన్ వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేసి విచారించగా గొర్రెలను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి బెల్లంపల్లి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాడితే కఠిన చర్యలు

వాంకిడి, ఫిబ్రవరి 19: పేకాడితే కఠిన చర్యలు తీసుకుంటామని వాంకిడి సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం ఎస్ఐ ప్రశాంత్‌తో కలిసి తమకు వచ్చిన సమాచారం మేరకు వాంకిడి మండలం ఖమన గ్రామంలోని పేకాట స్థావరంపై దాడి చేసి ఖామన గ్రామానికి చెందిన ఏడు గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్ ఫోన్లు, రూ.8280 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

దహెగాం,ఫిబ్రవరి19: దహెగాంకు చెందిన చప్పిడ విలాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కందూరి రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం పడాల రాజ్‌కుమార్ అనే వివోఏ ఐకేపీ మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశం వద్దకు వెళ్లి వీవోఏ రాజ్‌కుమార్‌ను విలాస్ అకారణంగా తిడుతూ అతనిపై దాడి చేశాడు. రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు విలాస్‌పై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వీవోఏ రాజ్‌కుమార్‌పై దాడిచేసిన విలాస్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి,బద్ద రోజా, తదితరులు డిమాండ్ చేశారు.

తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి19: కాగజ్‌నగర్‌లోని వెంపల్లి కిరాణా షాపులో తూనికలు, కొలతల అధికారులు బుధవారం తనిఖీ చేశారు. 26 కిలోల బియ్యం బ్యాగులో 25 కిలోలు మాత్రమే ఉండడంతో అధికారులు శ్రీ కన్యకా ఆగ్రో ఇండస్ట్రీస్‌పై కేసు నమోదు చేసి రూ.20 వేలు జరిమానా విధించినట్లు మెట్రాలోజీ అధికారి జలీల్ తెలిపారు. తూకంలో మోసం, ఇతరాత్ర అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

జిల్లా పంచాయతీ అధికారికి వినతి పత్రం ఇస్తున్న కార్యదర్శులు

హాజీపూర్, ఫిబ్రవరి 19 : రాష్ట్ర గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఫోరం (తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అనుబంధం) పిలుపు మేరకు బుధవారం అనను పు కలెక్టర్ దీపక్ కుమార్, డీపీవో వెంకటేశ్వర్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బొడ్డు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం ఆగస్టు నెల నుంచి చెక్కులు పెండింగ్‌లో ఉండడంతో వ్యాపార సంస్థలు సైతం సామాను, పెంట్రోల్ బంక్‌లలో ట్రాక్టర్ల డీజిల్ పోయడానికి ముందుకు రావడం లేదన్నారు. మార్చి 1వ తేదీ నుంచి తాము భరించలేని స్థితిలో ఉన్నామన్నారు. కలెక్టర్, డీపీవో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి తక్షణమే నిధులు విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చంద్రమౌళి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పూదరి నరేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు, తాజొద్దీన్, ఉపాధ్యక్షుడు సుమన్, వరప్రసాద్, క్రాంతి, జాయింట్ సెక్రటరీ దివాకర్, రమణతో పాటు పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

నస్పూర్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఎన్నిక

చెవుల వాసు

పీ సారయ్య

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 19 : నస్పూర్ మండల షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశం బుధవారం శ్రీరాంపూర్ కాలనీలో జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే నర్సింగ్, నియోజక వర్గం అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్ పాల్గొని నూతన కమిటీని నియమించారు. నస్పూర్ మండల షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చెవుల వాసు, ప్రధాన కార్యదర్శిగా పర్లపెల్లి సారయ్య, ఉపాధ్యక్షుడిగా పుట్ట రవి, ప్రచార కార్యదర్శిగా తరాల విజయ్, గౌరవ సలహాదారులుగా తరాల లక్ష్మీనారాయణను నియమించారు. ఈ కార్యకమంలో జిల్లా అధ్యక్షుడు తలారి రాజు, ఉపాధ్యక్షుడు రంజిత్‌కుమార్, శ్రీహరి, రాజ లింగు, సోగల రాములు, కొమురయ్య, సామ్యూల్ పాల్గొన్నారు.

మందమర్రి ఎంఈవోగా దత్తుమూర్తి

మందమర్రి రూరల్, ఫిబ్రవరి19: మందమర్రి మండల విద్యాధికారిగా మండలంలోని పొన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఎం.దత్తు మూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇది వరకు ఎంఈవోగా పనిచేసిన శ్రీనివాస్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన దత్తుమూర్తిని మండల విద్యా వనరుల కేంద్రంలో కార్యాలయ సిబ్బందితో కలిసి బొకే, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సీసీఓ గుండా మధుకుమార్,ఎమ్ఐఎస్ దుర్గం శ్యామ్,ఐఈ ఆర్పీలు రావుల శంకర్, నీలం సరిత, సీఆర్పీలు కొట్రంగి రామ్ చందర్, సుభాషిని,మెసెంజర్ రేణుక పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడిని గెలిపించాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 19 : కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తెలంగాణ ఉద్యమ కారుడు రవీందర్‌సింగ్‌ను గెలిపించుకోవాలని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థి సంఘం మాజీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా కేసీఆర్‌తో వెన్నంటే ఉండి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించాడని గుర్తు చేశారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత బంగారు తెలంగాణ నిర్మాణంలో తనవంతు పా త్ర పోషించాడని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెం దిన రవీందర్ సింగ్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పంచాయతీ సెక్రటరీల మండల కార్యవర్గం

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 19 : తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్) మండల కమిటీని బుధవారం సీనియర్ పంచాయతీ కార్యదర్శులు కొత్త సుజాత, సింగతి వంశీకృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రెటరీల మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కారుకూరి ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా అక్కల రాజమణి, అసోసియేట్ ప్రెసిడెంట్ గా గోపతి రాజేశ్, కోశాధికారిగా పోలంపెల్లి సురేశ్, ఉపాధ్యక్షుడిగా గోపతి సురేందర్, సామాంతుల మాధవి, జాయింట్ సెక్రటరీ గా బోడ రాజశేఖర్, మల్యాల సునీత, పబ్లిసిటీ సెక్రటరీ గా పోతు శృతి, ఆర్గనైసింగ్ సెక్రటరీ గా మోటాపలుకుల రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా శేర్ల వేనతి, చిట్టెం శ్రీలత, ఇండ్ల లావణ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.

స్థల సేకరణను వేగవంతం చేయాలి

నస్పూర్, ఫిబ్రవరి 19 : సమీకృత గురుకుల పాఠశాలలకు అవసరమైన స్థలాల సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్‌లో మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ కలెక్టర్లు , అదనపు కలెక్టర్లు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధికారులు, కలెక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే ప్రశాంతత

దండేపల్లి, ఫిబ్రవరి 19 : ధ్యానంతోనే ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత చేకూరుతుందని హార్ట్‌ఫుల్ నెస్ ధ్యాన కేంద్రం మంచిర్యాల జిల్లా నోడల్ ఇన్‌చార్జి పవన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తాళ్లపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ధ్యానంపై మూడు రోజుల పాటు అవగాహన కల్పించారు. పరీక్షలపై ఒత్తిడిని అధిగమించేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుదర్శన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు

భీమారం, ఫిబ్రవరి 19 : భీమారం మండల కేంద్రంలో బుధవారం కస్తూర్బా పాఠశాల సమీపంలో లారీని కారు ఢీకొన్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాల వైపు నుంచి చెన్నూర్ వైపునకు కంకర లారీ వెళ్తున్నది. ఈ క్రమంలో చెన్నూరు వైపు నుంచి మంచిర్యాలకు వెళ్తున్న కారు ఇరుకు రోడ్డు వద్ద అదుపు తప్పి కంకర లారీని ఢీకొట్టింది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. కారులోని ముగ్గురు ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. లారీ డైవర్ రాకేశ్, కారు డ్రైవర్ చెన్నూర్ చెందిన శ్రీకాంత్‌గా పోలీసులు గుర్తించారు. పోలీసులు అసంపల్లి కిరణ్, సత్తి రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

గంజాయి పట్టివేత

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 19: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తిలక్ నగర్ ఏరియాలో మూడు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కిలోల్లో గంజాయిని పట్టుకొని నిందితులను స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు సమాచారం. దాదాపు తొమ్మిది మంది నిందితులు పట్టుబడినట్లు తెలిసింది. పోలీసులు వారి వద్ద నుంచి పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఘటనపై స్థానిక మంచిర్యాల పట్టణ సీపీ ప్రమోద్ రావును వివరణ కోరగా త్వరలోనే ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో వివరాలు వెల్లడిస్తారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసాలు

తాండూర్, ఫిబ్రవరి 19 : కాసిపేట ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం తులసి, ఆశ కార్యకర్తలు శ్రీలత, స్రవంతి, లక్ష్మి, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

- మంచిర్యాల అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

పేర్ల నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 19 : దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. బుధవారం పట్టణంలోని సింగరేణి కళాభవన్‌లో జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, అలింకో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను పంపిణీ చేసేందుకు అర్హులైన వారి ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భోజనం, మజ్జిగతో పాటు తాగునీరు, హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, మందమర్రి ప్రాంతాలకు చెందిన దాదాపు 300 మంది దివ్యాంగులు హాజరై తమ వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్‌తో కలిసి మాట్లాడారు. దివ్యాంగత్వ శాతం, అర్హతను బట్టి దివ్యాంగులకు అవసరమైన సహాయ ఉపకరణాలు పంపిణ చేస్తామని తెలిపారు. దివ్యాంగులు ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత అలింకో సంస్థ ద్వారా వారికి కావలసిన ఉపకరణాలు త్వరలోనే అందజేసేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల వారికి గురువారం లక్షెట్టిపేట మండల కేంద్రంలోని రైతు వేదిక (వ్యవసాయ మార్కెట్ యార్డు)లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శారీరక దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్, మూడు చక్రాల రిక్షా, వీల్ చైర్, చంక కర్రలు, చేతి కర్రలు, బధిరులకు (మూగ, చెవిటి) శ్రవణ యంత్రాలు, అంధులకు ప్రత్యేక మొబైల్ ఫోన్లు, చేతి కర్రలు, మానసిక దివ్యాంగులకు ప్రత్యేక కిట్లు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ బెల్లంపల్లి ప్రాజెక్టు సీడీపీవో స్వరూపారాణి, సూపర్ వైజర్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి, డీహెచ్ఈ. డబ్ల్యూ, సంబంధిత అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

- మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య

దండేపల్లి, ఫిబ్రవరి 19 : విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని మంచిర్యాల డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులను ఇంగ్లిష్ సబ్జెక్టుపై పలు ప్రశ్నలు అడిగారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలి

- షీటీం అధికారి రమాదేవి

కాగజ్‌నగర్ : విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

సీసీసీనస్పూర్ : కబడ్డీ జట్టు క్రీడాకారులతో షీ టీం సిబ్బంది

కాగజ్‌నగర్, ఫిబ్రవరి19: సామాజిక మాధ్యమాలతో చాలా అప్రమత్తంగా ఉండాలని షీటీం ప్రతినిధి రమాదేవి అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని జ్యోతిబాపూలే వసతి గృహంలో బుధవారం మహిళలకు, విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలపై హింస , ఈవ్ టీజింగ్ , సైబర్ క్రైమ్‌లకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలు ఫేస్బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని మహిళలకు రక్షణ కల్పించేందుకు షీ టీంలు పనిచేస్తున్నాయని, సైబర్ క్రైమ్ 1930 కు డయల్ చేయాలని, ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షీటీం కాగజ్‌నగర్ ఫోన్ నంబర్ 8712670565 కు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భారతి, షీటీం సభ్యుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

క్రీడాకారులకు షీ టీం సేవలపై అవగాహన

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 19: రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సీసీసీ నస్పూర్‌లోని నాగార్జునకాలనీ సింగరేణి ప్రాణహిత స్టేడియంలో క్రీడాకారులకు షీ టీం సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్టేడియంలో కబడ్డీ క్రీడాకారిణులకు మహిళల భద్రత, చట్టాలు, యువతులపై వేధింపులు, ఆన్‌లైన్ మోసాలపై మంచిర్యాల జిల్లా షీ టీం సిబ్బంది వివరించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మహిళలు భయపడకుండా సెల్ నం. 6303923700 లేదా 100కు కాల్ చేయాలని కోరారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షీ టీం కానిస్టేబుళ్లు జ్యోతి, శ్రీలత, సతీశ్, కబడ్డీ కోచ్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన, ఫిబ్రవరి 19: విద్యుత్ మరమ్మతుల కారణంగా 20వ తేదీ గురువారం ఉదయం 11 గంటల నుంచి 3గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని రెబ్బెన విద్యుత్ శాఖ ఏఈ ఇమ్రాన్ తెలిపారు. సింగరేణి కాలనీ, సబ్ స్టేషన్ రోడులో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కౌటాల మండలంలో..

కౌటాల, ఫిబ్రవరి 19: కౌటాల మండలంలోని 132 కేవీ లైన్ నిర్మాణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బుధవారం తెలిపారు. బెజ్జూర్ ఫీడర్ 11 కేవీ, చీపురు దుబ్బా ఫీడర్ ఎల్‌సీ తీసుకున్నామని, ఇందులో భాగంగా రెబ్బెన(బి) బెజ్జూర్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలతో పాటు కౌటాల మండలంలోని గురుడుపేట, కన్నెపల్లి, కనికి. బోదంపల్లి గ్రామాలకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ దవాఖానల్లో వంద శాతం ప్రసవాలు చేయాలి

జన్నారంలోని దవాఖానను సందర్శించిన పీఆర్సీటీ సభ్యులు

జన్నారం, ఫిబ్రవరి 19 : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వంద శాతం ప్రసవాలు జరిగేలా చూడాలని జాతీయ ఆరోగ్య మిషన్ పీఆర్సీటీ సభ్యులు రమణ, శ్రీనివాస్ సూచించారు. బుధవారం జన్నారం పీహెచ్‌సీ, ఇందన్‌పల్లిలోని ప్రాథమిక ఉప కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్, వైద్యులు ఉమశ్రీ, ప్రశాంతి, డీపీవో వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

కెరమెరి, ఫిబ్రవరి 19: పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తుండగా జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్పీ డీవీ.శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ అధికారులు కెరమెరి మండలంలో అనార్‌పల్లిలో బుధవారం తనిఖీలు చేశారు. అనార్‌పల్లికి చెందిన భానోత్ విజయ్ కుమార్‌కు చెందిన బొలెరో పికప్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యమయ్యాయన్నారు. బియ్యాన్ని కెరమెరి పోలీస్ స్టేషన్‌కు తరలించి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్ తెలిపారు. ఈ తనిఖీలో టాస్క్ ఫోర్స్ ఎస్ఐ వెంకటేశ్, టాస్క్ ఫోర్స్ కానిస్టేబుళ్లు రమేశ్, సంజీవ్, దేవేందర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

కాసిపేట, ఫిబ్రవరి 19 : కాసిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఫేర్వెల్ డే తో పాటు క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఐఈవో అంజయ్య ప్రత్యేక అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సెల్ ఫోన్ తక్కువగా, అవసరం మేరకే వాడాలని సూచించారు. వృథా చేయకుండా ఒక ప్రణాళిక ప్రకారం 13 రోజులు మంచిగా చదువుకొని అన్ని పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్, మందమర్రి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి ప్రిన్సిపాల్ అంజయ్య, లక్షెట్టిపేట ప్రిన్సిపాల్ లక్ష్మణ్ రావు, జీజేఎల్ఏ అధ్యక్షుడు విజిత్ కుమార్, కళాశాల సిబ్బంది రమేశ్, రాజేశ్వరి, పీడీ బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

చదువు తోనే పురోగతి

సిర్పూర్(యూ),ఫిబ్రవరి19: చదువుతోనే పురోగతి సాధ్యం అవుతుందని తహసీల్దార్ ఉదయకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కేజీబీవీలో పెర్వెల్ పార్టీని నిర్వహించారు. ఒకప్పుడు కష్టపడి చదివాం కాబట్టే ఈ రోజు ఉద్యోగులుగా మాట్లాడుతున్నామని తెలిపారు. జీవితంలో ప్రతి విద్యార్థి లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టుదలతో అనుకున్న దానిని సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ , ప్రత్యేకాధికారి స్వప్న, ఎస్ఐ, ధర్మరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట : నృత్యం చేస్తున్న విద్యార్థులు

సిర్పూర్(యూ) : నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బిల్లులు వెంటనే చెల్లించాలి

వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 19 : గ్రామ పంచాయతీల్లో గత ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని, గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం నిధులను విడుదల చేయాలని బుధవారం మండల కార్యదర్శులు ఎంపీడీవో సుధాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం ఫిబ్రవరి పాలకవర్గం కాల పరిమితి ముగిసిన నాటి నుంచి గ్రామ పంచాయతీల రోజువారీ నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, ట్రాక్టర్, డీజిల్ బ్లీచింగ్, బయోటెక్స్, పారిశుధ్య సామగ్రిని, వీధి దీపాల నిర్వహణ, నీటి నిర్వహణ కోసం షాపులు, ట్రేడర్ల నుంచి తీసుకొచ్చి గ్రామ పంచాయతీల పనుల నిర్వహించామని తెలిపారు. వాటి బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలోపంచాయతీ కార్యదర్శులు శంకర్, అశోక్, ఆసిఫ్ అలీ, ఇస్తరి, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఉపాధి కల్పించాలి

సిర్పూర్(యూ), ఫిబ్రవరి19: మండలంలోని పేద గిరిజనులకు స్వయం ఉపాధి కోసం ఆర్థిక సాయం అందించాలని, గిరిజన నిరుద్యోగ యువకులకు రుణాలు అందించాలని వీటీడీఏ సంఘం మండల అధ్యక్షుడు కుమ్రం భీంరావు అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మ భుషణ్‌రావును కలిసి సన్మానించి వినతి పత్రం అందించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

క్షయ వ్యాధిపై అవగాహన

వాంకిడి, ఫిబ్రవరి 19: వైద్య ఆరోగ్య శాఖ ఆదేశానుసారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నామని మండల ఆరోగ్య అధికారి రవిదాస్ అన్నారు. బుధవారం మండలంలోని సవాతి గ్రామంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. రెండు వారాల కంటే ఎక్కువ దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆశ వర్కర్, ఏఎన్ఎంలకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం గోదావరి, భగవాన్ దాస్, మాజీ సర్పంచ్ సోయం భీం రావు, ప్రధానోపాధ్యాయుడు శ్యాం రావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

వాంకిడి, ఫిబ్రవరి 19: ఎండాకాలం దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి లేకుండా చూడాలని వాంకిడి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి నీటి ఎద్దడి నివారణ, పారిశుధ్య పనులపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో, ఏఈ, ఆర్ఎస్ డబ్ల్యూ, ఏపీవో, ఈసీ తదితరులు ఉన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 19: తెలంగాణ అకాడమీ ఫర్ నాలెడ్జ్ (టాస్క్)వారి ఆధ్వర్యంలో అందిస్తున్న ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీసీపీవో బూర్ల మహేశ్ అన్నారు. బుధవారం శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, క్రమశిక్షణ, ఆర్గనైజేషన్ బిహేవియర్ తదితర అంశాలపైన శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సాధించాలని సూచించారు. అనంతరం అభ్యర్థులకు ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ పత్రాలను టాస్క్ మేనేజర్ సాయికుమార్‌తో కలిసి అందజేశారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

బెజ్జూర్, ఫిబ్రవరి 19 : మండలంలోని ఎల్కపల్లిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల సౌకర్యార్థం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగంలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు నాణ్యతాప్రమాణాలు పాటించాలని గుత్తేదారులను ఆదేశించారు. ఈ రోడ్డులో క్యూరింగ్, మెటీరియల్ ఇంజినీరింగ్ అధికారుల సూచలతో రోడ్డు నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంతో ఏఈ ముక్బల్ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఇంటి నిర్మాణాల పరిశీలన

బెజ్జూర్, ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో బుధవారం ఆసిఫాబాద్ గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారి వేణుగోపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా మోడల్ హౌస్‌లో రూ.5 లక్షలతో నిర్మాణాలు చేసున్నట్లు అధికారి తెలిపారు. నెల రోజుల్లో ఈ నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజ్జూర్ గృహనిర్మాణ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ సజీయుద్దీన్ పాల్గొన్నారు.

జోడేఘాట్ సందర్శన

మ్యూజియాన్ని పరిశీలిస్తున్న మంచిర్యాల జిల్లా విద్యార్థులు

కెరమెరి, ఫిబ్రవరి 19: మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలోని జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం జోడేఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కుమ్రం భీం విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం ఆదివాసుల స్మారక మ్యూజియాన్ని సందర్శించారు. ఆదివాసీల ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిశీలించి, పోరాట వీరుడు కుమ్రం భీం చరిత్రను అడిగి తెలుసుకున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రెబ్బెన, ఫిబ్రవరి 19: మండలంలోని తుంగెడ గ్రామంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించినట్లు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ యదోష పేర్కొన్నారు. బ్యాంకు సేవలు, బీమా, తదితర పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌పీ ఆపరేటర్ గోలేటి నగేశ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ చందు, కార్యదర్శి గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు జుమ్మిడి అనందరావులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్సులో మరిచిపోయిన సర్టిఫికెట్ల అందజేత

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 19: తిర్యానికి చెందిన ప్రయాణికుడు బస్సులో మరిచిపోయిన ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లను బాధితుడికి డీఎం విశ్వనాథ్ బుధవారం అందజేశారు. ఆసిఫాబాద్ నుంచి తాండూర్‌కు బస్సులో ప్రయాణించిన దేవిదాస్ అతని భార్యకు సంబంధించిన స్టడీ సర్టిఫికెట్లను మరిచిపోయాడు. కండక్టర్ మనెమ్మ ఆ సర్టిఫికెట్లను డీఎం విశ్వనాథ్‌కు అప్పగించింది. ప్రయాణికుడి చిరునామా తెలుసుకొని సమాచారం అందించారు. బుధవారం ఆసిఫాబాద్ డిపోలో ప్రయాణికుడికి సర్టిఫికెట్లను డీఎం విశ్వనాథ్ అందించారు.